www.aksharadarbar.com
సోమవారం 26, ఆగస్టు 2024

అక్షర దర్బార్

voice of the people

తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :172 | పేజీలు : 05 | వెల : 05

త్వరలోనే 35 వేల ఉద్యోగాల భర్తీ..

- 10, 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు వీసీలు..
- రైతులు, విద్యార్థులే తమ ప్రాధాన్యత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సివిల్స్ అభ్యర్థులకు రూ. 1 లక్ష ఆర్థికసాయం

02

రేపు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక..

- 27 నుంచి మూడు రోజులపాటు
- యాదాద్రి, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటన
- కవులు, కళాకారులు, ప్రముఖులతో సమావేశాలు..
- ఆలయాల సందర్శన

02

సీఎంఆర్‌ఎఫ్ స్కాంలో శంకర్‌నాయక్?

తెలంగాణలో సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్‌ఎఫ్) స్కాం ప్రకంపనలు రేపుతోంది. రోగులకు చికిత్స అందించకుండానే నకిలీ బిల్లులు సృష్టించి కోట్ల రూపాయలను మింగేసిన కేటుగాళ్లకు సీఐడీ షాక్ ఇచ్చింది. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని 30 ప్రైవేట్ దవాఖానలపై సోమవారం సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు, దవాఖానల సిబ్బంది కుమ్మక్కై నిధులు నొక్కేసినట్లు నిర్ధారించింది. సచివాలయంలోని సీఎంఆర్‌ఎఫ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ విచారణ చేపట్టగా ప్రైవేట్ దవాఖానల అసలు రంగు బయటపడింది. అయితే.. ఈ సీఎంఆర్‌ఎఫ్ స్కాంలో మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కొందరు డాక్టర్లను అడ్డుపెట్టుకొని యాజమాన్యాలకు తెలియకుండా ఆయన దందా కొనసాగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో శంకర్‌నాయక్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆగమేఘాల మీద పంపిణీ చేయడంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే సీఐడీ అధికారులు మానుకోటలోని సిద్ధార్థ, సంజీవని దవాఖానల్లో నకిలీ బిల్లులపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈక్రమంలోనే ఈ స్కాంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తోపాటు ఆయన అనుచరుల పాత్రపై కూడా అధికారులు ఆరా తీస్తుండటం కలకలంరేపుతోంది. మానుకోట జిల్లాలో ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

– అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

02

నకిలీ బిల్లులతో కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు

యాజమాన్యాలకు తెలియకుండా నిధులు నొక్కేసినట్లు అనుమానాలు

- తెలంగాణలో ప్రకంపనలు రేపుతున్న సీఎంఆర్‌ఎఫ్ కుంభకోణం
- రాష్ట్రంలోని 30 ప్రైవేట్ హాస్పిటళ్లపై సీఐడీ ఎఫ్ఐఆర్
- లిస్టులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు దవాఖానలు
- హన్మకొండలోని రోహిణి, మహబూబాబాద్‌లో శ్రీసంజీవని, సిద్ధార్థ హాస్పిటళ్లపై కేసులు
- సీఎంఆర్‌ఎఫ్ దందాలో మానుకోట మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తోపాటు
- ఆయన అనుచరుల పాత్రపై అధికారుల ఆరా..
- జిల్లాలో కలకలం రేపుతున్న సీఐడీ రైడ్స్

కాటారంలో శంకర్ దాదా ఎంబీబీఎస్..!

శంకర్ దాదా ఎంబీబీఎస్ తరహాలో ట్రీట్‌మెంట్ రాకున్నా ఎంచక్కా రోగులకు చికిత్స చేస్తూ ప్రజల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తీరు విస్మయానికి గురి చేస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు చెలాయిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్ఎంపీ, బీఏఎమ్ఎస్లే ఎంచక్కా పెద్ద ఎత్తున్న భవంతులతో మల్టీ స్పెషల్ ఆస్పత్రుల వలె నిర్మాణాలు చేపడుతూ ట్రీట్ మెంట్ చేస్తున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిస్థితులు కాటారంలో ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.

– అక్షర దర్బార్, కాటారం

- అర్హతలు లేకున్నా ఆస్పత్రుల నిర్వహణ
- రోగులే వారికి ప్రయోగాత్మక చికిత్స కేంద్రాలు
- అంతా మా ఇష్టం అంటూ దోపిడీ
- డీఎంఅండ్ హెచ్‌వో ఆఫీస్ లో మీడియేటర్స్
- రోగుల సొమ్ముతో బ్యాంకాక్ టూర్లు

04

మెడికల్ షాపుల మాయాజాలం..

అడ్డగోలుగా ఔషధ వ్యాపారం

లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది..

03

గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్ట్

చర్లపల్లి జైలుకు నిందితుడు..

02

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

సీఎంఆర్ఎఫ్ స్కాంలో

శంకర్ నాయక్ ?

- నకిలీ బిల్లులతో కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు
- యాజమాన్యాలకు తెలియకుండా నిధులు నొక్కేసినట్లు అనుమానాలు
- తెలంగాణలో ప్రకంపణలు రేపుతున్న సీఎంఆర్ఎఫ్ కుంభకోణం
- రాష్ట్రంలోని 30 ప్రైవేట్ హాస్పిటల్లపై సీఐడీ ఎఫ్ఐఆర్
- లిస్టులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు దవాఖానలు
- హన్మకొండలోని రోహిణి, మహబూబాబాద్‌లో శ్రీసంజీవని, సిద్ధార్థ హాస్పిటల్లపై కేసులు
- సీఎంఆర్ఎఫ్ దందాలో మానుకోట మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్
- ఆయన అనుచరుల పాత్రపై అధికారుల ఆరా..
- జిల్లాలో కలకలంరేపుతున్న సీఐడీ రైడ్స్

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి : తెలంగాణలో సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) స్కాం ప్రకంపణలు రేపుతోంది. రోగులకు చికిత్స అందించకుండానే నకిలీ బిల్లులు సృష్టించి కోట్ల రూపాయలను మింగేసిన కేటుగాళ్లకు సీఐడీ షాక్ ఇచ్చింది. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని 30 ప్రైవేట్ దవాఖానలపై సోమవారం సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు, దవాఖానల సిబ్బంది కుమ్మక్కై నిధులు నొక్కేసినట్లు నిర్ధారించింది. సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ విచారణ చేపట్టగా ప్రైవేట్ దవాఖానల అసలు రంగు బయటపడింది. అయితే.. ఈ సీఎంఆర్ఎఫ్ స్కాంలో మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కొందరు డాక్టర్లను అడ్డుపెట్టుకొని యాజమాన్యాలకు తెలియకుండా ఆయన దందా కొనసాగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో శంకర్‌నాయక్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆగమేఘాల మీద పంపిణీ చేయడంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే సీఐడీ అధికారులు మానుకోటలోని సిద్ధార్థ, సంజీవని దవాఖానల్లో నకిలీ బిల్లులపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈక్రమంలోనే ఈ స్కాంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తోపాటు ఆయన అనుచరుల పాత్రపై కూడా అధికారులు ఆరా తీస్తుండటం కలకలంరేపుతోంది. మానుకోట జిల్లాలో ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

శంకర్ నాయక్ హస్తం !

సీఎంఆర్ఎఫ్ స్కాం మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మెడకు చుట్టుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సీఎంఆర్ఎఫ్ దందాలో శంకర్ నాయక్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని కొందరు డాక్టర్లను అడ్డుపెట్టుకొని శంకర్‌నాయక్ తన అనుచరుల ద్వారా ఈ అక్రమ దందా కొనసాగించినట్లుగా సీఐడీ అధికారులు అనుమానిస్తున్నారు. ఆస్పత్రుల యాజమాన్యాలకు తెలియకుండానే కోట్ల రూపాయల బిల్లులు కొల్లగొట్టినట్లు భావిస్తున్నారు. ఈక్రమంలోనే ఈ స్కాంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తోపాటు ఆయన అనుచరుల పాత్రపై అధికారులు ఆరా తీస్తుండటం కలకలంరేపుతోంది. కాగా, శంకర్‌నాయక్ ఇప్పటి వరకు ఈ ఘటనపై స్పందించకపోవడం గమనార్హం. తనపై మీడియాలో వస్తున్న వార్తాకథనాలపై శంకర్‌నాయక్ ఏ విధంగా స్పందిస్తారు..? సీఐడీ విచారణలో శంకర్‌నాయక్ ప్రమేయం రుజువైతే ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.. ? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ అంశం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.

ఈ దవాఖానలపైనే ఎఫ్ఐఆర్..

హైదరాబాద్: అరుణశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (ఐఎస్ సదన్ ఎక్స్ రోడ్), శ్రీకృష్ణ హాస్పిటల్ (సైదాబాద్), జనని హాస్పిటల్ (సైదాబాద్), హిరణ్య హాస్పిటల్ (మీర్‌పేట్), డెల్టా హాస్పిటల్ (హస్తినాపురం), శ్రీరక్ష హాస్పిటల్ (బీఎన్ రెడ్డి నగర్), ఎంఎంఎస్ హాస్పిటల్ (సాగర్ రింగ్ రోడ్), ఏడీఆర్ఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (శారదానగర్), ఎంఎంవి ఇందిరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (కొత్తపేట), శ్రీసాయి తిరుమల హాస్పిటల్ (బైరామల్ గూడ)

ఖమ్మం: శ్రీ శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డా. జే.ఆర్. ప్రసాద్ హాస్పిటల్, శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, వైష్ణవి హాస్పిటల్, సుజాత హాస్పిటల్, కొత్త అమృత హాస్పిటల్, ఆరెంజ్ హాస్పిటల్, మెగశ్రీ హాస్పిటల్ (బోనకల్).

నల్గొండ : నవీనా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (మిర్యాలగూడ), మహేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (మిర్యాలగూడ), అమ్మ హాస్పిటల్ (రైల్వే స్టేషన్ రోడ్)

కరీంనగర్ : సప్తగిరి హాస్పిటల్ (జమ్మికుంట), శ్రీసాయి హాస్పిటల్ (పెద్దపల్లి),

వరంగల్: రోహిణి హాస్పిటల్ (హనుమకొండ)

మహబూబాబాద్ : శ్రీ సంజీవిని హాస్పిటల్, సిద్ధార్థ హాస్పిటల్

రేపు గవర్నర్

జిష్ణుదేవ్ వర్మ రాక..

- 27 నుంచి మూడు రోజులపాటు
- యాదాద్రి, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటన
- కవులు, కళాకారులు, ప్రముఖులతో సమావేశాలు.. ఆలయాల సందర్శన
- విస్తృత ఏర్పాట్లు చేసిన నాలుగు జిల్లాల యంత్రాంగం
- పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు

అక్షరదర్బార్, వరంగల్ : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు వరంగల్, యాదాద్రి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఆగస్టు 27న యాదాద్రి ఆలయం దర్శించుకోనున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా ములుగు జిల్లాకు వెళ్లి వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన అవార్డు గ్రహీతలతో సమావేశమవుతారు. యునెస్కో గుర్తింపు పొందిన కాకతీయ కళా ఖండం రామప్ప ఆలయాన్ని వీక్షించి లక్నవరానికి వెళ్లనున్నారు. మరుసటి రోజు హనుమకొండలో పేరొందిన కళాకారులు, ప్రముఖులతో సమావేశం కానున్నారు. అనంతరం వరంగల్ ఖిల్లాను, భద్రకాళీ, వేయిస్తంభాల ఆలయాలను సందర్శిస్తారు. మూడో రోజు జనగామ జిల్లాలో కవులు, కళాకారులతో సమావేశమై అక్కడి నుంచి కొలనుపాకను సందర్శిస్తారు. గవర్నర్ పర్యటనకు నాలుగు జిల్లాల యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తుండగా, పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లకు సన్నద్ధమయ్యారు.

గంజాయి స్మగ్లర్ పై

పీడీ యాక్ట్ నమోదు

చర్లపల్లి జైలుకు నిందితుడు..

అక్షరదర్బార్, వరంగల్ : గంజాయి స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ సోమవారం పీడీయాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ నుండి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తు న్న భూపాలపల్లి జిల్లా గోరుకొత్తపల్లి ప్రాంతానికి చెందిన గజ్జి సహదేవ్ రాజ్‌పై వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా జారీ చేసిన పీడీయాక్ట్ ఉత్తర్వులను శాయంపేట సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ రంజిత్ రావు, దామెర ఎస్సై అశోక్ నిందితుడికి పరకాల సబ్ జైల్లోఅందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడు గత జూన్ 8వ తేదీన మరో ఇద్దరు నిందితులతో కలిసి ఏపీ నుంచి నుండి మహారాష్ట్రకు గంజాయి అక్రమ రవాణాకు చేస్తుండగా టాస్క్ ఫోర్స్, దామెర పోలీసులు సంయుక్తంగా ముదాను అరెస్టు చేశారు. నిందితుల నుండి పోలీసులు రూ. 50 లక్షల విలువగల 192 కిలోల గంజాయితోపాటు కారు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని జైలుకు తరలించారు.

నిందితుడికి పీడీయాక్ట్ ఉత్తర్వులను అందజేస్తున్న శాయంపేట సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై అశోక్

త్వరలోనే 35 వేల ఉద్యోగాల భర్తీ..

- 10, 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు వీసీలు..
- రైతులు, విద్యార్థులే తమ ప్రాధాన్యత : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సివిల్స్ అభ్యర్థులకు రూ.లక్ష ఆర్థిక సాయం

అక్షరదర్బార్, హైదరాబాద్: విద్యార్థుల ఉద్యమం వల్లే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందని, తమ ప్రాధాన్యత రైతులు, విద్యార్థులేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కృషి చేస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్న ఆయన, త్వరలోనే మరో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామని స్పష్టం చేశారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం కింద రూ. 1 లక్ష ఆర్థికసాయం అందజేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అభ్యర్థులకు రేవంత్‌రెడ్డి రూ. లక్ష అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యాలు లేకపోవడం వల్ల నిరుద్యోగం పట్టిపీడిస్తుందన్నారు. చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2 వేల మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి యంగ్ ఇండియా వర్సిటీలో ఏటా 20 వేల మందికి శిక్షణ ఇస్తామని సీఎం చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తామని, 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసిందని, 10, 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు నూతన వైస్ ఛాన్సలర్లను నియమిస్తామని సీఎం ప్రకటించారు. అదేవిధంగా వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యోగ అర్హత పరీక్షలను వాయిదా వేస్తే నిరుద్యోగులకే నష్టమని, సహేతుకమైన కారణాలు చెబితే నిరుద్యోగులు చెప్పింది వినడానికి మేం సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు.

మెడికల్ షాపుల మాయాజాలం..

- అడ్డగోలుగా ఔషధ వ్యాపారం
- లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది..
- ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకాలు
- ఫిజీషియన్ శాంపిల్లు, జనరిక్ మందుల విక్రయాలు
- నామమాత్రంగా డ్రగ్ ఇన్ స్పెక్టర్ తనిఖీలు
- చోద్యం చూస్తున్న వైద్యారోగ్య శాఖ
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

అక్షర దర్బార్, రేగొండ: మెడికల్ షాపు చిన్నదైనా పెద్దదైనా అందులో ఫార్మాసిస్ట్ ఉండాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు ఇవ్వాలి. మందులు ఎలా వేసుకోవాలో రోగికి వివరించాలి. ఇవి.. మెడికల్ షాపు నిర్వాహకుల ప్రాథమిక నిబంధనలు. కానీ రేగొండ,గోరి కొత్తపల్లి మండలాల్లోని మెడికల్ షాపుల వ్యాపారం కిరాణ షాపుల్లా మారింది.డాక్టర్ రాసిచ్చే చిట్టీతో సంబంధం లేకుండా ఎరవడిగినా మందులు ఇచ్చేస్తున్నారు.డీ ఫార్మసీ లేదా ఎం-ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటే చాలు మెడికల్ షాపు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇంతజరుగుతున్నా.. డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అనారోగ్యం చెబితే చాలు..

అనారోగ్యం గురించి చెబితే చాలు మెడికల్ షాపుల్లో అన్ని రకాల మందులు ఎంత మొత్తంలో కావాలన్నా ఇస్తారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అవసరమే లేదు. ఏ మందులు వేసుకోవాలో.. రోజుకు ఎన్ని వేసుకోవాలో.. ఎన్ని రోజులు వాడాలో కూడా వారే చెప్పేస్తారు. కార్డియాలజీ, సైక్రియాట్రిక్, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, డయాబెటిక్, బీపీ, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర సమస్యలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదు. ఈ వ్యాధుల ఔషధాల డోస్ లో తేడాలు, రకాలు ఉంటాయి. వ్యాధి తీవ్రత, రోగి వయసు, శరీర తత్వం తదితరాలను బట్టి మెడిసిన్‌ను నిర్ణయిస్తారు. కానీ, మెడికల్ షాపుల నిర్వాహకులు ఈ సమస్యలకు సైతం మందులు ఇవ్వడం గమనార్హం.

నకిలీ మందుల జోరు..

డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం జోరుగా కొనసాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదుల వేరే కంపెనీ మందులు అంటగడుతున్నారు. సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు ఇది కూడా దాని లాగే పనిచేస్తుందని చెబుతున్నారు. మండలంలో సుమారు 10 పైగా మెడికల్ షాపులున్నాయి. రోజూ రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుంది.

నిబంధనలకు పాతర..

డ్రగ్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్ ప్రకారం ప్రతీ మెడికల్ షాపులో రిజిస్టర్డ్ ఫార్మసిస్టు ఉండాలి. బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ చేసిన వారు మాత్రమే మెడికల్ షాపు నిర్వహించాలి. మెడికల్ షాపులకు అనుమతిచ్చే సమయంలో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఫార్మాసిస్టు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయాలి. ఏరియా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఈ బాధ్యత నిర్వర్తించాలి. కానీ కొందరు ఇన్‌స్పెక్టర్లు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది

ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితో మాత్రమే దుకాణాలు నిర్వహించాలి. కానీ, ఉమ్మడి మండలాల్లో అనేక మందుల షాపులు బినామీ వ్యక్తులే నిర్వహిస్తున్నారు. మెడికల్ పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధికారులు, డ్రగ్ ఇన్ స్పెక్టర్లు ఇప్పటికైనా స్పందించాలని కోరుకుంటున్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే రైతులకు న్యాయం చేయాలి

భూ నిర్వాసిత రైతు లక్కం వేణు

అక్షర్ దర్బార్, పరకాల : గ్రీన్ ఫీల్డ్ హైవేలో దామెర మండలం నుండి పరకాల మీదుగా భూములు పోతున్న రైతులందరికీ భూములు కొనుక్కునేందుకు తగు సహాయం అయినా అందించాలి. లేకుంటే భూమికి బదులుగా భూమి కొనివ్వాలని గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతు లక్కం వేణు అన్నారు. రైతు వేణు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఏ రైతు నష్టపోయినా సాయం చేసే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ హైవే లో భూములు పోతున్న రైతులందరికీ ఆ భూమికి సరైన భూమి వేరే దగ్గర ఇవ్వాలని కోరారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

రాజేష్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి

అక్షర దర్బార్, పరకాల : ఆగస్టు15న అమెరికాలో మృతి చెందిన ఏరుకొండ రాజేష్ మృతదేహాన్ని వారి స్వగ్రామం ఆత్మకూర్ కు తీసుకొని రాగా సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సందర్శించి పూలమాల వేసి వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రాజేష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజేష్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు.

కుళాయి నీళ్లల్లో చేప పిల్లలు

- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి
- తొర్రూరు టీఎల్ఎఫ్ మాజీ అధ్యక్షురాలు బందు విజయ

వాంతులు, వీరేచనాలతో ప్రజల అవస్థలు
తొర్రూరు మున్సిపల్ అధికారుల నిర్వాకం

తాగు నీళ్లలో దర్శనమిచ్చిన చేపపిల్లలు

అక్షర దర్బార్,తొర్రూరు: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజలకు మంచినీటిని (డ్రింకింగ్ వాటర్) రోజు విడిచి రోజు అందిస్తున్న తరుణంలో సోమవారం ఏడవ వార్డులో డ్రింకింగ్ వాటర్ వస్తున్న సందర్భంగా మంచినీటి కుళాయిల వద్ద నీళ్లను మహిళలు పట్టుకుంటుండగా చేప పిల్లలు మరియు చెత్తాచెదారంతో కూడిన నీళ్లు రావడం జరిగింది. వాటిని చూసిన మహిళలు ఈ నీటిని తాగితే అనారోగ్యాలకు గురి అవుతామని నీటిని పట్టుకోకుండా వదిలేశారు. ఆ డ్రింకింగ్ వాటర్ ను పట్టుకోవడానికి వచ్చిన టిఎల్ఎఫ్ మాజీ అధ్యక్షురాలు బందు విజయ చూసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ నుంచి ఇలాంటి చెత్త చెదారం, చేప పిల్లలు రావడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఈ నీరు తాగిన వారు అనారోగ్య పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పట్టణంలో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రపరచకుండా వాటిలో బ్లీచింగ్ పౌడర్ వేయకుండా ప్రజలకు నీళ్లు అందిస్తున్నారని మండిపడ్డారు. అసలు ఈ నీళ్లు మిషన్ భగీరథ నీళ్ల లేక బావుల నుండి వచ్చే నీళ్లా అని ప్రశ్నించారు. ఇటీవల తొర్రూరు పట్టణంలో డెంగీతో ఇద్దరు చనిపోయారని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా ఈ సీజన్ లో మలేరియా, డెంగీ, చికెన్ గునియా రోగాలకు ప్రజలు గురవుతున్నారని, దీనికి తోడు పట్టణంలో అపరిశుభ్రమైన డ్రింకింగ్ వాటర్ అందిస్తున్నారని, వాటిని తాగిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు,

టిపిజికేఎస్ కేటీకే 5 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీగా నరేష్ నేత

అక్షర దర్బార్,భూపాలపల్లి : టీబీజీకేఎస్ 5ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీగా నరేష్ నేత ఎన్నికయ్యారు. అనంతరం నరేష్ నేత మాట్లాడుతూ నా నియమానికి సహకరించిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షులు బడితల సమ్మయ్య, కేంద్ర కమిటీ బ్రాంచ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి వేడుకలు

అక్షర దర్బార్, భూపాలపల్లి : మదర్ థెరిసా జయంతి వేడుకలు సోమవారం థెరిసా మీడియా ఎక్సలెన్సీ అవార్డు చైర్మన్ బుర్ర కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బుర్ర కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కోల్‌కత్తా మురికివాడల్లోని అభాగ్యుల జీవితాల్లో వెలుగునింపిన మహోన్నత వ్యక్తి మదర్ థెరిసా అని కొనయాడారు. కార్యక్రమంలో థెరిసా ఎక్సలెన్సీ అవార్డ్స్ సభ్యులు భాస్కర్ ,కుమార్ పాల్గొన్నారు.

అనుమానితులను గోదారి దాటించొద్దు

కాళేశ్వరం ఎస్సై చక్రపాణి

అక్షర దర్బార్, మహాదేవపూర్ : అనుమానితులను పడవలలో గోదావరి నది దాటించొద్దని కాళేశ్వరం ఎస్సై చక్రపాణి తెలిపారు. సోమవారం కాళేశ్వరంలో పడవలు నడిపే వారిని పిలిపించి పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఇచ్చారు. నది ప్రవాహం ఎక్కువగా ఉన్నందున పడవలను నడపకూడదని , మావోయిస్టులను పడవల ద్వారా నది దాటించొద్దని సూచించారు. మావోయిస్టులకు సహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న కాళేశ్వరం ఎస్సై చక్రపాణి

మల్లికాంబ మనోవికాస కేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

61వ డివిజన్ ఫాతిమానగర్ లో వేడుకల్లో పాల్గొని ఉట్టి కొడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

ఘనంగా కృష్ణాష్టమి

- అలరించిన చిన్నారుల వేషధారణలు
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య

అక్షరదర్బార్, హనుమకొండ : 61వ డివిజన్ ఫాతిమానగర్ (నాన్య తండా)లో శ్రీకృష్ణష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ఉట్టికొట్టి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్ర ప్రజలందరికి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

మల్లికాంబ మనో వికాస కేంద్రంలో..

హనుమకొండ బాల సముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా, కష్టసుఖాలను సమభావంతో స్వీకరిస్తూ, అమూల్యమైన ఈ జీవితాన్ని పండుగగా మలుచుకోవాలనే సందేశాన్ని శ్రీకృష్ణ పరమాత్ముని జీవితం మనకు అందిస్తుందని తెలిపారు. అనంతరం కృష్ణుని, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులకు ఎంపీ కావ్య మెమెంటోలు అందజేశారు.

రేగొండలో సందడిగా వేడుకలు

అక్షర,దర్బార్ రేగొండ: మండల కేంద్రంలో శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో సందడి చేశారు. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టి కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

శ్రీ విద్యానికేతన్ హై స్కూల్లో

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండల కేంద్రంలోని శ్రీ విద్యానికేతన్ హై స్కూల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుని గోపికల వేషాధరణలో అలరించారు. కార్యక్రమంలో శ్రీ ఆదర్శవాణి విద్యా సంస్థల చైర్మన్ నాగనబోయిన రవి మాట్లాడుతూ.. తనను నమ్ముకున్న వారికి తన పాలనలో న్యాయం చేసిన మహనీయుడు శ్రీకృష్ణుడని కొనియాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ భిక్షపతి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన తెగలను వర్గీకరించాలి

- వర్గీకరణ మూలంగానే ఆదివాసీలకు న్యాయం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

అక్షర దర్బార్, హన్మకొండ: ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ యందు సోమవారం ఆదివాసీ ప్రజా సంఘాల అఖిలపక్ష జేఏసీ సమావేశం జరిగింది. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ చందా లింగయ్య దొర హాజరయ్యారు. సమావేశంలో వారు మాట్లాడుతూ.. గిరిజన తెగల్లో వర్గీకరణ జరగాలని డిమాండ్‌చేశారు. వర్గీకరణ మూలంగా ఆదివాసీ తెగలు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సంక్షేమ రంగాల్లో అభివృద్ధి చెందుతారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, జాతీయ కో కన్వీనర్ పోడెం రత్నం, తుడుందెబ్బ రాష్ట్ర మాజీ అధ్యక్షులు వట్టం నారాయణ, గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

పంటలకు ‘నకిలీ’ గండం

- బోగస్ కంపెనీల మందులతో దిగుబడి శూన్యం
- తీవ్రంగా నష్టపోతున్న రైతాంగం
- బిల్లులు లేకుండానే విక్రయాలు
- కంపెనీ పేర్లతో కమర్షియల్ వ్యాపారం
- పర్యవేక్షణ చేయని అధికారులు
- లబోదిబోమంటున్న రైతులు

అక్షర దర్బార్, నల్లబెల్లి : నకిలీ మందుల అమ్మకాలు నల్లబెల్లి మండలంలో జోరందుకున్నాట్లు తెలుస్తోంది.మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ మందులు,బోగస్ కంపెనీల మందులను రైతులకు నమ్మబలికి విక్రయిస్తున్నాట్లు రైతులు వాపోతున్నారు.నకిలీ మందుల వ్యవహారం మండలం లో జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి.పురుగు మందుల వ్యవహారం లో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు రైతుల గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యారని రైతులు అంటున్నారు.వేలకు వేల డబ్బులు వెచ్చించి పురుగు మందులను కొనుగోలు చేసి పంటపై స్ప్రే చేస్తే అవి ఏ మాత్రం ప్రభావం చూపడం లేదని రైతులు వాపోతున్నారు.సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తూ ఫర్టిలైజర్ షాపుల పై తూతూ మంత్రంగా దాడులు చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని రైతులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు.

అంతంత మాత్రంగానే దాడులు

నల్లవెల్లి మండలంలోని ఫర్టిలైజర్ షాపులలో వ్యవసాయ శాఖ అధికారులు అంతంతమాత్రంగానే దాడులు నిర్వహిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదో పేరుకు మాత్రమే షాపులపై దాడులు నిర్వహించి, నకిలీ మందులు విక్రయించినట్లయితే

పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని చెబుతున్నప్పటికీ అదంతా ఓ డ్రామాల అనిపిస్తున్నదని పలువురు రైతులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు.

చీకటి దందా ఆగేనా

నకిలీ, బయోమందులను విక్రయించొద్దని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా కొంతమంది అక్రమార్కుల కనుసైగలో చీకటి దందా కొనసాగుతోంది. బహిరంగంగానే ఫర్టిలైజర్ షాపులలో బయో మందులను, నకిలీ పురుగుమందులను విక్రయించడం పలు అనుమానాలకు దారితీస్తుంది.

కంపెనీ పేర్లతో కమర్షియల్ వ్యాపారం

వరి పత్తి మిర్చి పంటల తెగుళ్ల నివారణకు వాడే మందుల పేర్లతో రైతులు గుర్తించలేని విధంగా నకిలీ మందులను తయారు చేసి రైతులకు కంపెనీ మందులు అంటూ అంటగడుతూ కమర్షియల్ వ్యాపారం చేస్తున్నారని రైతులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. అచ్చం కంపెనీ పేర్లతో ఉండే విధంగానే నకిలీ పురుగుమందులను తయారు చేసి బ్రాండెడ్ మందులుగా రైతులకు నమ్మబలికి సామాన్య ప్రజల రక్తం తాగుతున్నారని రైతులు అంటున్నారు.

బిల్లులు లేకుండానే మందుల విక్రయాలు

మండలంలోని కొన్ని ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు రైతులకు బిల్లులు ఇవ్వకుండానే నకిలీ మందులను విక్రయిస్తూ రైతుల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిల్లులు లేకుండా మందులను విక్రయించవద్దని అధికారులు చెబుతున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా ఫర్టిలైజర్ షాపుల నిర్వహకులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని రైతులు అంటున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్

అక్షరదర్బార్, హన్మకొండ: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. హన్మకొండ హరిత కాకతీయలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, వీసీల నియామాకాలను జాప్యం లేకుండా వెంటనే చేపట్టాలన్నారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. గురుకుల విద్యార్థుల మరణాలు బాధాకరమని, గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్, కార్యదర్శి భాషబోయిన సంతోష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ రవితేజ, జిల్లా సమితి సభ్యులు పసుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

కాటారంలో శంకర్ దాదా ఎంబీబీఎస్!

- అర్హతలు లేకున్నా ఆసుపత్రులు నిర్వహణ
- రోగులే వారికి ప్రయోగాత్మక చికిత్స కేంద్రాలు
- అంతా మా ఇష్టం అంటున్న హాస్పిటల్ నిర్వాహకులు
- డీఎంహెచ్ వో ఆఫీస్ లో మీడియేటర్స్
- మమ్మల్ని ఎవరేం చేయలేరని ధీంకం
- రోగుల సొమ్ముతో బ్యాంకాక్ టూర్లు

అక్షర దర్బార్, కాటారం : మెగాస్టార్ చిరంజీవి నటించిన శంకర్దాదా ఎంబీబీఎస్ సినిమాని అందరం చూసే ఉంటాం కదా.. అందులో వైద్య చికిత్సలు అందించడం రాకున్న ఫేక్ సర్టిఫికెట్ పొంది చిరంజీవి ఇబ్బందులు పడుతున్న తీరు అందరినీ కడుపుబ్బా నవ్వించగా అది సినిమా పరంగా సూపర్ హిట్..కానీ అదే తరహాలో నిజజీవితంలో శంకర్దాదా ఎంబీబీఎస్ ల మాదిరిగా ట్రీట్మెంట్ రాకున్నా ఎంచక్కా రోగులకు చికిత్స చేస్తూ ప్రజల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తీరు విస్మయానికి గురి చేస్తుంది. అదెక్కడో కాదు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులు చలాయిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్ఎంపీ, బీఏఎమ్ఎస్లే ఎంచక్కా పెద్ద ఎత్తున్న భవంతులతో మల్టీ స్పెషల్ ఆసుపత్రుల వలె నిర్మాణాలు చేపడుతూ ట్రీట్మెంట్ చేస్తుండగా కేవలం ఎంబీబీఎస్ పట్టా ఉంటే చాలని మరికొందరు అప్పుడే పాసై ఎలాంటి అనుభవం లేని డాక్టర్లను తీసుకొచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిస్థితులు కాటారంలో హాట్ టాపిక్ గా మారింది. ఓ పక్కా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మిన్నకుండిపోవడంపై కాటారం మండలవ్యాప్తంగా పలు రకాల ఆరోపణలు వినబడుతున్నాయి.దీంతో కాటారం మండలకేంద్రంలో శంకర్ దాదా ఎంబీబీఎస్ సినిమా మాదిరి వ్యక్తుల యాజమాన్యంలో ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏముంటుందబ్బా అంటూ జనాలు పలు పర్యాయ అర్థాలను వెతుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.అధికారులు మాత్రం కానియ్యండి మేమున్నాం కదా అంటూ మౌఖిక

ఆదేశాలు జారీ చేస్తూ ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులపై స్నేహ భావాన్ని చాటుతున్నారని అనుకుంటున్నారు.

డీఎంహెచ్ వోలో మీడియేటర్స్

కాటారం మండలకేంద్రంలో ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఇంతలా రోగులను నిలువుదోపిడి చేయడానికి కారణం డీఎంఅండ్హెచ్వో ఆఫీస్,ప్రైవేట్ ఆసుపత్రుల నడుమ ఉన్న మీడియేటర్స్ అని సమాచారం. రాజకీయ నాయకుల అండదండలతో వైద్య వృత్తిలో తల పండిన వ్యక్తులుగా పేరుతెచ్చుకున్న ఇతగాళ్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులను మచ్చిక చేసుకోవడమే వీరి పనిగా పెట్టుకున్నారట. కాగా సంబంధిత వైద్య అధికారులకు పని పూర్తయ్యాకా కాస్ట్లీ పార్టీలు ఇస్తూ వారికి దగ్గరగా ఉంటారని తెలుస్తోంది.కాటారం ప్రైవేట్ ఆసుపత్రులకు సంబంధించి ఏ చిన్న ప్రాబ్లెమ్ వచ్చినా మెయింటనేన్స్ వీరే చూసుకుంటారని అందరూ చర్చించుకుంటున్నారు. పలాన రోజున కాటారంలోని ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీలు జరుగుతాయని వీరి దృష్టికి రావడమే ఆలస్యం హే బాలాజీ, ఓం సాయిరాం, హరహర మహాదేవ, అమ్మా లక్ష్మీదేవీ, జై భార్గవ అంటూ దైవాల పేర్లతో ఉన్న హాస్పిటల్ నిర్వాహకులకు వెంటనే సమాచారాన్ని చేరవేస్తుంటారట. వెంటనే అప్రమత్తమయ్యే సదరు ఆసుపత్రుల నిర్వాహకులు తమ తమ హాస్పిటళ్లను మూసివేసి వెళ్తుంటారని ప్రజలు చెబుతున్నారు. సదరు మీడియేటర్ల దయతో కాటారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రుల దందా మూడు హై డోస్ ఇంజెక్షన్లు...ఆరు సెలైన్ల... మాదిరిగా దినదినాభివృద్ధి చెందుతుండగా మీడియేటర్స్ సైతం జిల్లా స్థాయిలో చక్రం తిప్పుతూ తమ స్వామినాను చాటుకుంటున్నారు.

రోగుల సొమ్ముతో బ్యాంకాక్ టూర్లు

కాటారంలోని ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులకు వర్షాకాలం అనేది ఓ సీజన్ గా ఉంటుందట. మనషుల ప్రాణాపాయ దుస్థితిని బిజినెస్గా ఆలోచించే కొందరి నిర్వాహకులకు ఏడాది మొత్తం వర్షాకాలాన్నే టార్గెట్ చేసుకుని నడిపిస్తారనేది ఓపెన్ సీక్రెట్.కాగా ఈ సీజన్లో ఏడాది మొత్తంగా డబ్బులని వెళ్లదీసుకుని దర్జాగా రోగుల సొమ్ముతో బ్యాంకాక్ టూర్లకు వెళ్లి షికార్లు చేస్తుంటారటనేది కాటారం మండలవ్యాప్తంగా టాక్. కాగా బ్యాంకాక్ టూర్ ఖర్చు ఎంతుంటదో మీరే ఊహించుకోవాల్సిన అవసరం ఉండగా కేవలం టూర్ కోసమే అంతమేర ఖర్చు పెట్టి ఉంటే మిగతా తమ వ్యక్తిగత విలాసవంతమైన జీవితాల కోసం ఏమాత్రం ప్రజలను పీడించారో ఇట్టే అవగతమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వాసుపత్రులు ఏమవుతున్నట్లు?

కాటారం సబ్ డివిజన్ మండలాలైన కాటారం,మహదేవపూర్,మహాముత్తారం,పలిమెల,మల్హర్లు ఉండగా ప్రతీ మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.ముఖ్యంగా ఐదు మండలాలకు పెద్ద దిక్కుగా మహదేవపూర్ మండలకేంద్రంలో ముప్పై పడకల సామాజిక వైద్యశాల ఉండగా అందరూ ఎంబీబీఎస్,ఎండీ కోర్సులు చదివిన అనభవజ్ఞులైన వైద్యులు ఉండడం కాటారం సబ్ డివిజన్లో వైద్యం పరంగా శుభపరిణామమైన అంశం.అయితే వైద్యం విషయంలో ఇంతలా ప్రభుత్వ ఆసుపత్రులు ఉండగా కాటారం మండలకేంద్రంలో ప్రైవేట్ ఆసుపత్రులు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న తీరుపై అయోమయ పరిస్థితి నెలకొంది.ప్రభుత్వం వైద్యం విఫలం కావడంతోనే ప్రైవేట్ ఆసుపత్రులు వెలుస్తున్నాయా లేదా ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందా అనే కోణంలో ఆలోచించాల్సి వస్తోందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం,సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కాటారం మండకేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రుల ఆగడాల నుండి ప్రజలని రక్షించాలని పలువురు కోరుతున్నారు.